ప్రజాశక్తి
మంగళవారం 12 సెప్టెంబర్ 2023 5
శ్రీ సత్యసాయి

ప్రజలతో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ పి.అరుణ్‌బాబు

అర్జీదారులకు సత్వర పరిష్కారం చూపాలి

జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

స్పందన ద్వారా సమర్పించే అర్జీలకు సత్వర పరిష్కారాన్ని అందించాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు వివిధ శాఖల ధికారులను ఆదేశించారు. సోమవారం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి 76 అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారుడు సంతప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఎ, రీఓపెనింగ్, లేకుండా అర్జీదారుడు సంతప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. బియాండ్ ఎస్ఎల్ఎ 12 ఉన్నాయని వాటిని త్వరితగతిని పరిష్కరించాలని ఆదేశించారు. ఇంటింటి ఓటర్ల సర్వే కార్యక్రమం క్లైంలను క్షుణ్ణంగా పరిశీలించి కార్యక్రమం రెండు రోజుల లోపలపూర్తి చేయాలని ఆదేశించారు. ఇంటింటి ఓటర్ సర్వే క్లైంల పరిష్కారం, రీ సర్వే, జగనన్న ఆరోగ్య సురక్ష పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి క్షేత్రస్థాయిలో అమలుపై ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఒకే ఇంట్లో పదిమంది ఓటర్లు ఉన్న ఇల్లుపై ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. వీటిపై నియోజకవర్గ సహాయ ఎన్నికల అధికారులు, ఎన్నికల డిప్యూటీ తహాల్దారులు, పర్యవేక్షణ ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ టిఎస్.చేతన్, డిఆర్ఓ కొండయ్య, పుట్టపర్తి ఆర్డీవో భాగ్యరేఖ, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి, సిపిఓ విజయ్ కుమార్, హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి, పీఆర్ ఎస్ఈ గోపాల్ రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, డీఆర్డీఏ పీడీ నరసయ్య, డిఎంహెచ్ఓ డా॥కష్ణారెడ్డి వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిరంతరంగా 'జగనన్నకు చెబుదాం'

జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈనెల 13వ తేదీన నల్లమడ, 15న ఓబుల చెరువు, 20న గోరంట్ల, 22న కొత్తచెరువు, 27 న బుక్కపట్నం, 29న పుట్టపర్తి ఎంపిడిఓ కార్యాలయాల్లో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా, మండల స్థాయి అధికారులు వారి శాఖలకు చెందిన నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

హిందూపురంలో రాస్తారోకో చేస్తున్న టిడిపి నాయకులు

టిడిపి బంద్ పాక్షికం

◆ కొనసాగిన నిరసనలు
◆ తెలుగుదేశం నేతల అరెస్టులు, గృహ నిర్బంధాలు
◆ తెరుచుకోని ప్రయివేటు పాఠశాలలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా తెలుసుగుదేశం పార్టీ సోమవారం తలపెట్టిన బంద్ ఉమ్మడి అనంతపురం జిల్లాలో పాక్షికంగా జరిగింది. ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు యథావిధిగా నడిచాయి. ఆర్టీసీ సబస్సులను అడ్డుకునేందుకు ఉదయమే తెలుగుదేశం, జనసేన నాయకులు ప్రయత్నం చేసిన్పటికీ పోలీసులు వారిని అరెస్టు చేసి స్టేషన్లకు తరలించారు. దీంతో ఆర్టీసీ బస్సులు యథావిధిగా నడిచాయి. తెలుగుదేశం పార్టీ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఆదివారం రాత్రి నుంచే పోలీసులు అప్రమత్తమయ్యారు. ముఖ్య నాయకులపై నిఘా పెట్టారు. వారిని ఉదయం నుంచే గృహ నిర్బంధం చేశారు. ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు మాత్రం ఉదయం నుంచే వీధుల్లోకి వచ్చారు.

పెనుకొండలో టిడిపి జిల్లా అధ్యక్షుడు బికె.పార్థసారథిని అరెస్టు చేస్తున్న పోలీసులు

ప్రధాన కూడళ్లలో నిరసనలు సైతం చేపట్టారు. పోలీసులు వీరిని అరెస్టు చేసి స్టేషన్లకు తరలించారు. కదిరిలో ఆర్టీసి బస్సును అడ్డుకునే క్రమంలో ఒక బస్సు అద్దం పగిలింది. తక్కిన చోట పోలీసులు, నాయకుల మధ్య వాగ్వివాదాలతోనే నడిచింది.

పెద్దఎత్తున కొనసాగిన అరెస్టులు

బంద్ నేపథ్యంలో తెలుగుదేశం, జనసేన నాయకులను పెద్దఎత్తున అరెస్టులు చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా సుమారు మూడు వేల మంది వరకు అరెస్టు అయ్యి ఉంటారన్నది అంచనా. అన్ని ప్రధాన కేంద్రాలతోపాటు, మండల కేంద్రాల్లోనూ నిరసనలు

ధర్మవరంలో నిరసన తెలుపుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్

జరిగాయి. పెనుకొండ వద్ద జాతీయ రహదారి 44పై టిడిపి నాయకులు నిరసనలు చేపట్టారు. తనకల్లులో వైఎస్.జగన్మోహన్‌రెడ్డి దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. అనంతపురం నగరంలో ఆర్టీసీ బస్టాండు వద్ద బస్సులను అడ్డుకునేందుక టిడిపి, జనసేన నాయకులు ప్రయత్నించారు. వారిని అరెస్టు చేసి అనంతపురం త్రీటౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. బుక్కరాయసముద్రం వద్ద పెద్దఎత్తున టిడిపి నాయకులు రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. మాజీ మంత్రి పరిటాల సునీతను వెంకటాపురంలో గృహ నిర్బంధం చేయగా తప్పించుకుని బంద్‌లో పాల్గొనేందుకు వెలుతుండగా నసనకోట వద్ద అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ధర్మవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పరిటాల శ్రీరామ్ కూడా ఇంటి గోడదూకి వెనుకవైపు నుంచి పోలీసు నిర్బంధం నుంచి తప్పించుకుని నిరసనలో పాల్గొన్నారు. శ్రీ సత్యసాయి జిల్లా పరిధిలో గాండ్లపెంట వద్ద నిరసనలో పాల్గొన్న కదిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ కందికుంట వెంకటప్రసాద్, పెనుకొండలో బికె.పార్థసారథి, సవితమ్మలను అరెస్టు చేశారు. మడకశిరలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మాజీ ఎమ్మెల్సీ ఈరన్నలను గృహ నిర్బంధం చేశారు. అనంతపురం జిల్లాలోనూ ముఖ్య నేతలను పోలీసులు అరెస్టు చేశారు.

బంద్‌ను ప్రత్యక్ష్యంగా పర్యవేక్షించిన డిఐజి అమ్మిరెడ్డి

తెలుగుదేశం పార్టీ బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో ఎక్కడా ఎటువంటి ఘటనలూ చోటు చేసుకోకుండా ఉండేలా పోలీసులు చర్యలు చేపట్టారు. బంద్ జరుగుతున్న తీరును డిఐజి అమ్మిరెడ్డి ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతపురం నగరంలో ఆయన పర్యటించారు. బంద్ ప్రభావం పెద్దగా లేదని, అన్ని సవ్యంగా నడుస్తున్నట్టు ఆయన టవర్‌క్లాక్ సమీపంలో కలిసిన మీడియా ప్రతినిధులతో చెప్పారు. ముందస్తు చర్యలు తీసుకోవడంతో సజావుగా జరిగినట్టు తెలిపారు.

కాలవ శ్రీనివాసులుకు అస్వస్థత

టిడిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు సోమవారం నాడు అస్వస్థతకు గురయ్యారు. చంద్రబాబు నాయుడుతోపాటు ఆయన నంద్యాల నుంచి ఉన్నారు. రెండు రోజులుగా ఆయన వెంట ఉంటూ నిద్రాహారాల్లేకుండా ఉన్నారు. ఈ తరుణంలో సోమవారం ఉదయం ఆయన విజయవాడలోనే అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆయన్ను రమేష్ ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షల అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్టు సమాచారం.

ఇంటింటికీ 'జగనన్న ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జగనన్న ఆరోగ్య సురక్ష పథకం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పి.అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని స్పందన సమావేశ మందిరంలో ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకంతో పేద ప్రజలందరికీ ఆరోగ్య భరోసా దక్కుతుందని చెప్పారు. ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య అవసరాలను గుర్తించడం, అవసరమైనవారికి గ్రామాల్లోనే ఆరోగ్య శిబిరాలు నిర్వహించి వైద్యం అందించడం, పెద్ద ఆస్పత్రులకు సిఫారుసు చేయడం లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని రూపకల్పన చేశారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లు వారి పరిధిలోని అన్ని కుటుంబాలనూ సందర్శించి ఇంట్లో ఆరోగ్య సమస్యలున్నవారిని గుర్తించి ఎఎన్ఎంలు, క్లస్టర్ హెల్త్ ఆఫీసర్లకు సమాచారం ఇస్తారని చెప్పారు. ఎఎన్ఎంలు, సీహెచ్‌వోలు ఇంటింటికీ వెళ్లి, అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహిస్తారని వెల్లడించారు. ఈ నెల 15 నుంచి గ్రామ వార్డు వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య రక్షణపై అవగాహన కల్పిస్తారన్నారు. 16న వైఎస్సార్ విలేజ్ క్లీనిక్ పరిధిలోని గహాలను ఎఎన్ఎంలు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సందర్శిస్తారని చెప్పారు.

పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ మాధవరెడ్డి

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి : ఎస్పీ

ప్రజాశక్తి-కొత్తచెరువు

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన నేపథ్యంలో శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎస్పీ మాధవరెడ్డి పోలీసు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం నాడు టిడిపి నిర్వహించిన బంద్ సందర్భంగా ఆయన కొత్తచెరువలో పర్యటించారు. పోలీసులు తీసుకున్న చర్యలపై వారితో మాట్లాడారు. బస్టాండ్ కూడలిలో పోలీసులతో కలిసి బంద్ ప్రభావాన్ని పరిశీలించారు. ఈ ఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 144 సెక్షన్ అమల్లో ఉందన్నారు. రాస్తారోకోలు, ధర్నాలకు అనుమతి లేదన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వాసుదేవన్ సిఐ రాగిరి రామయ్య ఎస్ఐలు లింగన్న, నరసింహులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల కోసం వినతి

ప్రజాశక్తి-బత్తలపల్లి

మండలంలోని దంపెట్ల గ్రామంలో అర్హులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయాలని కోరుతూ సర్పంచి చల్లా కరుణాకర్ నాయుడు తహశీల్దార్ యోగేశ్వరిదేవిని కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 162-4 సర్వే నెంబర్ 1999-2000లో ప్రభుత్వం దాదాపుగా 185 ఇంటి స్థలాలను పేదలకు మంజూరు చేసేందుకు జాబితా సిద్ధం చేసిందన్నారు. ఇందులో 120 మందికి ఇళ్లు మంజూరు చేయగా, నిర్మాణాలు చేసుకున్నారన్నారు. అక్కడ మిగిలిన స్థలాలను కొంత మంది ఫోర్జరీ సంతకాలతో ఒక్కోరు 4,5 ప్లాట్లను అక్రమంగా పొందారన్నారు. ఈ విషయమై గత ప్రభుత్వంలో పేదలు ఇళ్ల పట్టాల కోసం అధికారులకు దరకాస్తు చేసుకున్నా పట్టించుకోలేదన్నారు. అధికారులు స్పందించి 162-4లో అర్హులకు ఇళ్ల పట్టాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఎంపీ మిథన్ రెడ్డి జన్మదినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-హిందూపురం

రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథన్‌రెడ్డి జన్మదినోత్సవ వేడుకలను సోమవారం వాల్మీకి నాయకుడు సుభాష్ గాంధీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు, కార్యకర్తల సమక్షంలో వైసిపి నాయకుడు గుడ్డంపల్లి వేణురెడ్డి కేక్‌కట్ చేసి అందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి వాల్మీకి లోకేష్, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కార్యదర్శి లక్ష్మీనారాయణప్ప, నాయకులు చాంద్ బాషా, సోమశేఖర్ రెడ్డి, ఇలియాజ్, శివ, చిరంజీవి, రాజారెడ్డి, డిఆర్‌జి శీనా, శ్రీనివాసులు పాల్గొన్నారు.

తాడిమర్రి ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-బత్తలపల్లి

ఎస్ఐ నాగస్వామి

తాడిమర్రి ఎస్ఐగా నాగస్వామి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో రొద్దం మండలంలో ఎస్ఐగా పనిచేసే తాడిమర్రి మండలానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు లేకుండా చేయడమే పోలీస్ కర్తవ్యమన్నారు. గొడవలకు దిగకుండా సర్దుకుపోయే విధంగా ప్రజలు సహకరించాలన్నారు

విఆర్‌కు కదిరి పట్టణ సిఐ

తమ్మిశెట్టి మధు

కదిరి టౌన్ : కదిరి పట్టణ సిఐగా విధులు నిర్వహిస్తున్న తమ్మిశెట్టి మధును విఆర్‌కు పంపుతూ డిఐజి అమ్మిరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కదిరి నుంచి తక్షణం రిలీవ్ కావాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కదిరి పట్టణ సిఐగా ప్రస్తుతానికి ఎవరినీ నియమించలేదు.

ఎడిసిసి ద్వారా రైతులు, మహిళలకు రుణాలు

ప్రజాశక్తి-కదిరి టౌన్

ఎడిసిసి బ్యాంకు ద్వారా రైతులు, మహిళలకు విరివిగా రుణాలు అందజేస్తున్నట్లు ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యే సిద్ధారెడ్డి, ఎడిసిసి ఛైర్‌పర్సన్ లిఖిత పేర్కొన్నారు. కదిరి పట్టణం సైదాపురం ఆంజనేయస్వామి దేవస్థానం ఎదురుగా నూతనంగా నిర్మించిన ఎడిసిసి బ్యాంకు కార్యాలయ భవనాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే తమ బ్యాంకు లక్ష్యమన్నారు. అనంతపురం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ద్వారా గ్రామీణ ప్రాంత రైతులు, మహిళలకు రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. రైతులు చిన్న, మధ్య తరహా వారిని ప్రోత్సహించే తక్కువ వడ్డీకి వివిధ రకాల రుణాలు సకాలంలో మంజూరు చేస్తున్నామన్నారు. బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దశాబ్దాల కాలం నుంచి రైతులకు సహకార కేంద్ర బ్యాంక్ మంచి సేవలు అందిస్తోందని తెలియజేశారు. బ్యాంకు ద్వారా రైతులకు అవసరమైన సబ్సిడీ రుణాలను కూడా అందుబాటులో ఉన్నాయన్నారు. తక్కువ వడ్డీతో రునాలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు బ్యాంకు సిబ్బంది, సొసైటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎడిసిసి బ్యాంకు నూతన భవాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, ఛైర్‌పర్సన్

మొక్కజొన్న పంట పరిశీలన

మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ప్రజాశక్తి-రొద్దం

'నకిలీ విత్తనాలతో పంట నష్టం' అనే శీర్షిక ప్రజాశక్తిలో సోమవారం నాడు వెలువడిని కథనంపై వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు స్పందించారు. ఈ మేరకు మండలంలోని గౌరాజుపల్లి గ్రామంలో రైతు సుబ్బరాయప్ప పొలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు హైబ్రిడ్ సిపి 333 రకం విత్తనాలను సాగు చేశారన్నారు. పంట వేసిన భూమి తేలికపాటి ఇసుక నేలగా ఉందన్నారు. దీనికితోడు కలుపు సరిగా తొలగించకపోవడం వల్ల పైరు ఎదగలేదన్నారు. తెగుళ్ల నివారణకూ చర్యలు తీసుకోలేదన్నారు. దీని వల్లనే పంట నష్టపోయినట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. ఇదే గ్రామంలో సిపి 333 రకం విత్తనం సాగు చేసిన వెంకట్ రెడ్డి పొలంలో మొక్కజొన్న పంట ఆశాజనకంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏరువాక కేంద్రం పుట్టపర్తి శాస్త్రవేత్తలు రామసుబ్బయ్య, రవి కిషోర్, పెనుగొండ వ్యవసాయ సంచాలకుల స్వయంప్రభ, అశోక్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల అక్రమాలపై తహశీల్దార్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి-సోమందేపల్లి

రేషన్ డీలర్లు సిండికేట్‌గా ఏర్పడి తూకాల్లో అక్రమాలకు పాల్పడుతున్నారని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దన్న ఆరోపించారు. రేషన్ డీలర్ల అక్రమాలను అరికట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ సురేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పెద్దన్న మాట్లాడుతూ సోమందేపల్లిలో ఉన్న రేషన్ డీలర్లు సిండికేట్‌గా ఏర్పడి వంతుల వరీగా కార్డుదారులకు సరుకులు పంపిణీ చేస్తున్నారన్నారు. తద్వారా కార్డుదారులు పని వదులుకొని రేషన్ తీసుకోవాల్సి వస్తోందన్నారు. సరుకుల తూకాల్లో సైతం అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ఎన్ఎండి వాహనాలు వృథాగా పడి ఉన్నాయన్నారు. పాపిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన 55 దళిత కుటుంబ కార్డుదారులు 3 కి.మీ దూరంలో ఉన్న సోమందేపల్లికి వచ్చి బియ్యం తీసుకోవాల్సి వస్తుందన్నారు. ఇకనైనా తహశీల్దార్, సంబంధిత అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని, లేనిచో రేషన్ షాపుల వద్ద నిరసనలు చేస్తామని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు, కెవిపిఎస్ వెంకటేశులు, మాబు, కొండా వెంకటేశులు, రామాంజనేయులు, రవి, ఈడిగ నాగరాజు, చేనేత కార్మిక సంఘం కార్యదర్శి శీలా నారాయణస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం బెస్త కిష్టప్ప, భవన నిర్మాణ కార్మిక సంఘం నాగభూషణ, కళ్లు గీత కార్మిక సంఘం రామకృష్ణప్ప, సంజీవప్ప, శ్రీనివా సులు, కృష్ణప్ప, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న సిపిఎం నాయకులు

అభివృద్ధి చేసి చూపిస్తాం : దీపిక

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని వైసిపి సమన్వయ కర్త, ఇన్‌ఛార్జి దీపిక పేర్కొన్నారు. పురపాలక సంఘంలోని 31వ వార్డులో నూతనంగా చేపట్టిన సిసి మురుగు కాలువ నిర్మాణ పనులను మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఇంద్రజతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా గడపగడపకూ మన ప్రభుత్వం కింద వస్తున్న నిధులతో పాటు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి సహకారంతో ప్రత్యేక నిధులను తీసుకొచ్చి అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ చిన్నమ్మ, షాజియా, వైసిపి నాయకులు నాగరాజు, సిపిసి సాధిక్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

ప్రభుత్వం ప్రజల కోసం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని నియోజకవర్గ సమన్వయ కర్త, ఇన్‌ఛార్జి దీపిక అన్నారు. సోమవారం పురపాలక సంఘంలోని 10వ వార్డు లక్ష్మీపురంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్‌తో కలిసి దీపిక గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి పథకాలు అందని లబ్ధిదారులకు వెంటనే ఆ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ జబివుల్లా, కౌన్సిలర్లు షాజియా, నాయకులు సాధిక్, నాగమణి, మల్లిక, శివన్న, ఇలియాజ్, నాగరాజు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గహ సారథులు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న ఇన్‌ఛార్జి దీపిక, ఛైర్‌పర్సన్ ఇంద్రజ

13న బెహలూల్ షా ఖాద్రీ గంధం వేడుకలు

పెనుకొండ : పట్టణ సమీపంలోని జాతీయ రహదారి పక్కన వెలసిన బెహలూల్ షా ఖాద్రీ స్వామి దర్గా గంధం వేడుకలు ఈనెల 13న ప్రారంభం కానున్నాయి. 13, 14న దీపారాధన కార్యక్రమం జరగనున్నట్లు దర్గా పీఠాధిపతి ఆదోని షెక్షావలి తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా స్వామి వారి గంధం ఉత్సవాలు ప్రతి ఏటా జరుగుతుంటాయన్నారు. ఇరాన్ దేశం సీస్తాన్ పట్టణానికి చెందిన బెహలూల్‌షా ఖాద్రీ స్వామి వారు యోగిగా తన గురువు అజ్ఞానుసారం ఆధ్యాత్మిక మార్గంలో భారతదేశానికి వచ్చి సర్వమత సామరస్యానికి కృషి చేసినట్లు చరిత్ర చెబుతోంది. గంధం సందర్భంగా భక్తులకు అన్నదానంతో ప్రసాదాలు పంపిణీ చేస్తామన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై శిక్షణ

పుట్టపర్తి రూరల్ : ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై పుట్టపర్తి ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలు, ఎఎన్ఎంలకు శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పుట్టపర్తి మండలంలో సెప్టెంబర్ 3 నుంచి 13వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో వాలంటీర్లు, ఎఎన్ఎంలు ప్రతి ఇంటికీ వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితి, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలను గుర్తించాలన్నారు. గుర్తించిన సమస్యలను ఆన్‌లైన్లో నమోదు చేయాలన్నారు. వీటికి సంబంధించి ప్రత్యేక నిపుణులైన డాక్టర్లు క్యాంపులో అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించి, ఉచితంగా మందులు అందిస్తారన్నారు. అవసరమైతే మెరుగైన చికిత్స కోసంపై ఆసుపత్రులకు సూచిస్తారని తెలిపారు. సెప్టెంబర్ 3న అమగొండపాలెం, 6న దిగవచెర్లోపల్లి, 10న చెర్లోపల్లి కార్యక్రమంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రమణారెడ్డి, ఎంపీడీవో అశోక్ కుమార్ రెడ్డి, తహశీల్దార్ నవీన్ కుమార్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కష్ణయ్య, వైద్యులు డాక్టర్ నాగరాజు నాయక్, డాక్టర్ జ్యోష్ణ పాల్గొన్నారు.

స్పందనలో 16 అర్జీలు

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవా రం ఎస్పీ ఎస్వీ మాధవ్‌రెడ్డి నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 16 పిటిషన్లు అందాయి. ఇందులో భాగంగా నల్లచెరువు మండల పరిధిలోని గురూజీవాండ్లపల్లి గ్రామానికి చెందిన జయలక్ష్మి భర్త అత్తమామల నుంచి తన కుమారుడిని ఇప్పిం చాలని ఎస్పి ముందు కన్నీరు మున్నీరైంది. స్పందించిన ఎస్పీ న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే పిటిషన్లపై పోలీసు అధికారులు సకాలంలో స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పి సిఐ రవీంద్రారెడ్డి, బిసిఆర్బి సిఐ సుబ్బారావు, లీగల్ సెల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'బంద్ ప్రభావం లేదు' వేణురెడ్డి

ప్రజాశక్తి-చిలమత్తూరు

టిడిపి రాష్ట్ర బంద్‌కి ప్రజలు ఎక్కడా సహకరించ లేదని, దీంతో హిందూపురం నియోజకవర్గంలో బంద్ ప్రభావం ఏమాత్రం లేదని నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త భర్త వేణురెడ్డి తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయంలో సోమవారం ఆయన మీడియతో మాట్లాడుతూ చంద్రబాబు చేసిన తప్పును ప్రజలు గుర్తించారు కనుకే సహకరించడం లేదన్నారు. తప్పు చేస్తే ఎంతటి వారైనా శిక్ష అనుభవించక తప్పదని రుజువైందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట కార్పొరేషన్ అవినీతి కేసులో బాబు అడ్డంగా దొరికిపోయాడని చెప్పారు. ఈ కేసులో ఆయన శిక్ష అనుభవించక తప్పదని తెలిపారు. ఈ కేసుతో పాటు మరో నాలుగు అవినీతి కేసులు కూడా ఆయనపై ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పురుషోత్తమరెడ్డి, నాయకులు రామక్రిష్ణరెడ్డి, రవింద్రరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డెక్కిన తెలుగుతమ్ముళ్లు

మద్దతు తెలిపిన సిపిఐ, జనసేన పార్టీలు.. నిరసన కార్యక్రమాలను భగ్నం చేసిన పోలీసులు..
పలువురి అరెస్టు.. ముఖ్యనాయకుల గృహ నిర్బంధం

కందికుంటను గాండ్లపెంట పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు, మడకశిరలో గుండుమల, ఈరన్నను గృహ నిర్బంధం చేసిన పోలీసులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

టిడిపి అధినేత, మాజీ సిఎం చంద్రబాబు అరెస్టుకు నిరసనగా సోమవారం చేపట్టిన బంద్‌తో పట్టు కేంద్రం అట్టుడికింది. తెల్లవారుజామునే నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్‌ను హౌస్ అరెస్టు చేయడానికి ఇంటి వద్దకు వెళ్లారు. ర్యాలీలో పాల్గొనకుండా పార్టీ కార్యాలయం వద్ద బందోబస్తు చేపట్టారు. దీంతో శ్రీరామ్ పార్టీ కార్యాలయం వెనుక వైపు గోడ దూకి బైకులో గాంధీ సర్కిల్ చేరుకుని పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీ చేపట్టారు. డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వన్‌టౌన్ సిఐ సుబ్రమ ణ్యం, సిబ్బంది అడ్డుకోగా శ్రీరామ్ శ్రేణులతో కలిసి రోడ్డు పై బైఠాయించారు. పోలీసులు శ్రీరామ్‌ను వన్‌టౌన్ స్టేషన్‌కు తరలించగా నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున అక్కడికి వద్దకు చేరుకుని సిఎం జగన్‌కు వ్యతిరేకంగా నినదించారు. ఆర్టీసీ బస్టాండ్‌లో బస్సులు బయటకు వెళ్లకుండా నిరసన చేస్తున్న నాయకులు పురుషోత్తంగౌడ్, భీమనేని ప్రసాద్‌నాయుడు, పరిశే సుధాకర్, నాగేంద్ర, వెంకటేశులను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ఎన్టీఆర్ సర్కిల్‌లో కొందరు ధర్నా చేపట్టగా సిఐ సుబ్రమణ్యం, సిబ్బంది నాయకులను స్టేషన్‌కు తరలించారు. అంతకు మునుపు ఎస్పీ మాధవరెడ్డి ధర్మవరం వచ్చి బంద్ గురించి డీఎస్పీ శ్రీనివాసులును అడిగితెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ మీడియాతో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా బంద్ ప్రశాంతంగా జరుగుతుందని, ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగలేదన్నారు. ర్యాలీలు, సభలు నిర్వహించరాదని, ఆంక్షలు అమలులో ఉందని ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

తనకల్లు : స్థానిక తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల వద్ద టిడిపి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టగా ఎస్ఐ రాంభూపాల్‌యాదవ్, సిబ్బంది నాయకులు, కార్యకర్తలను స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో మండల కో కన్వీనర్ బ్రహ్మానందరెడ్డి, పిజి మల్లికార్జున, రమణయ్య, మండల కార్యదర్శి నాగేంద్రప్రసాద్, వాల్మీకి అశోక్, ఎస్టీ సెల్ రాష్ట్ర నాయకులు హరినాయక్, పెద్దపల్లి భాస్కర్‌రెడ్డి, శివరాం, ఓబులేసు, దామోదర్, శివయ్య, రమణ, వెంకటేష్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు. అలాగే అంబేద్కర్ కూడలిలో ధర్నా చేస్తున్న వారిని పోలీసులు అరెస్టు చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ రెడ్డి శేఖర్ రెడ్డి, బీగం శంకర్ నాయుడు, జనసేన నాయకులు అమర్, కార్తికేయ, కెవి రమణ, సోంపాల్యం నాగభూషణ, మల్లికార్జున, నాగేంద్రప్రసాద్, మహబూబ్‌బాషా, దాము, శ్రీధర్‌రెడ్డి, శంకర్‌నాయుడు, మధుకర్‌నాయుడు, చిన్నప్ప, ఓబులేసు, శివ, జల్లా రవి, రమణ, చంద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : మాజీ ఎమ్మెల్యే ఈరన్న వర్గీయులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్‌లో నిరసన తెలిపి సైకో సిఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలగడంతో పోలీసులు వారిని బలవంతంగా రోడ్డుపై ఈడ్చుకెళ్తూ వ్యాన్ ఎక్కించుకుని స్టేషన్‌కు తరలించారు.

గోరంట్ల: టిడిపి నాయకులు, కార్యకర్తలు బంద్ చేయడానికి రోడ్డుపైకి రావడంతో ధర్నాలు, రాస్తారోకోలు చేయకూడదని వారిని పోలీసులు స్టేషన్‌కు తరలించారు. పోలీస్ శాఖ 30 యాక్ట్ అమలు చేయడంతో రోడ్డుపై గుంపులుగా ఉండకూడదని చెదరగొట్టారు. టిడిపి సానూభూతిపరులను ముందస్తుగా స్టేషన్‌కు తరలించగా సిఎం జగన్ డౌన్ డౌన్ అంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సోమశేఖర్, సర్పంచి నరసింహమూర్తి, నాయకులు వేణు, అజంతుల్లా, ఉత్తమ రెడ్డి, ఎల్ఎన్ నారాయణస్వామి, శ్రీనివాసులు, వెంకటేష్, నరేష్, వేణు, మణిశేఖర్‌రెడ్డి, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

జగన్ సైకో : పరిటాల శ్రీరామ్

పాత్రికేయులతో మాట్లాడుతున్న శ్రీరామ్

ధర్మవరం టౌన్ : దేశంలోనే మచ్చలేని నాయకుడు టిడిపి అధినేత చంద్రబాబుపై అవినీతి అనే మరక వేయడం దారుణమని నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్కిల్ డెవలెప్‌మెంట్ పథకం 80 వేల మందికి జీవనోపాధి ఇచ్చిందన్నారు. జగన్ సైకో అనడానికి చంద్రబాబు అరెస్టు నిదర్శనంగా భావించవచ్చన్నారు. ప్రభుత్వానికి, సిఎం జగన్‌కు వ్యతిరేకంగా మాట్లాడితే జైలుకు పంపాలన్నదే వైసిపి ధ్యేయమన్నారు. నాలుగేళ్లగా చూస్తున్నామని ప్రభుత్వాన్ని ప్రశ్నించినా, ప్రతిపక్షాల పార్టీలో చురుగ్గా ఉన్న వారిపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. గతంలో రూ. లక్షల కోట్ల అవినీతి చేసి జైలుకు వెళ్లిన జగన్ చంద్రబాబుపై అక్రమంగా కేసులు బనాయించి అరెస్టు చేయించారని మండిపడ్డారు.

అగళి : టిడిపి ముఖ్య నాయకులను ముందుస్తుగా తెల్లవారుజామున 6 గంటలకు ఎస్ఐ లావణ్య అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అయినా కొందరు నాయకులు బస్టాండ్‌లో రాస్తారోకో చేపట్టి సిఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అలాగే టైర్లకు నిప్పంటించి దహనం చేశారు. ఎస్ఐ లావణ్య మాట్లాడుతూ అరెస్టు అయిన వారిని రాత్రి 8 గంటల వరకూ వదలమని తెలిపారు.

సోమందేపల్లి : అవాంఛనీయ సంఘటనలకు ఆస్కారం లేకుండా బంద్ ప్రశాంతంగా ముగిసింది. టిడిపి నాయకులు మండలంలోని పాఠశాలలు, వాణిజ్య సముదాయాలను మూసివేయించారు. ఎస్ఐ విజయకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పలువురు టిడిపి నాయకులను ఎక్కడికక్కడ నిర్బంధించి స్టేషన్‌కి తరలించగా వారు స్టేషన్ ఆవరణలోనే సిఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. నిర్బంధించిన నాయకులు, కార్యకర్తలను సొంత పూచీకత్తుపై సాయంత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ సిద్ధలింగప్ప, వెంకట రమణ, నరసింహులు, కిష్ట, గోపాల్, వడ్డే సూరి, అశ్వర్థ, నాగమణి, అనసూయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు : మండలంలో ఉదయం నుంచే దుకాణాలను స్వచ్ఛందంగా బంద్ చేశారు. 144 సెక్షన్ ఆంక్షలు అమలులో ఉన్నందున పోలీసులు నాయకులను ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. గ్రామాల్లో నాయకులను ఎక్కడికక్కడ హౌస్ అరెస్టు చేశారు. కొత్తచెరువులో సిఐ రామయ్య, ఎస్ఐలు లింగన్న, నరసింహులు ఆధ్వర్యంలో ఉదయం పోలీసు బలగాలు, స్పెషల్ పార్టీ పోలీసులు కలిసి పెద్దఎత్తున కవాతు నిర్వహించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు హరినాథ్ చౌదరి, మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, నాగేంద్రప్రసాద్, వైవి మురళి, సప్లయర్స్ రామ్మోహన్, సుబ్బాచారి, సురేష్, ప్రభాకర్, పాల్గొన్నారు.

రొద్దం : టిడిపి ఆధ్వర్యంలో రొద్దంలో బంద్ నిర్వహించారు. జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథిని ముందస్తు గా హౌస్ అరెస్ట్ చేసేందుకు సిఐ వెంకటరమణ ఆర్.మరువపల్లిలో ఉన్న నివాసనికి వెళ్లగా అప్పటికే ఆయన పెనుకొండకు వెళ్లి ధర్నాలో పాల్గొన్నారు. పోలీసులు స్థానికంగా కొందరు మండల నాయకులను అరెస్ట్ చేయగా మిగిలిన వారు దుకాణాలు, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలను మూత వేసి ప్రశాంతంగా బంద్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, నియోజకవర్గ అధ్యక్షులు చిన్నప్పయ్య, హరీష్, మనోహర్, సురేష్, గౌరాజుల్లి నారాయణ, పవన్, సత్తి, మురళి, రామచంద్ర, రామకృష్ణ, మౌలాలి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

కనగానపల్లి : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా చేపట్టిన బంద్‌లో పాల్గొననున్న సిపిఐ, టిడిపి నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టు దారుణమని, తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దివాళా కోరుతనానికి నిదర్శనమన్నారు. ఇకనైనా సిఎం జగన్ ప్రతిపక్ష పార్టీ నాయకులను అణగతొక్కడం మానేసి పరిపాలనపై దృష్టి సారించాలని హితవు పలికారు. సిపిఐ నాయకులు బాలరాజు, బి.మహదేవ స్కూలు ఆఫీసులో ధర్నా చేస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. కార్యక్రమంలో సురేష్ చౌదరి, ఎంపిటిసి బిల్లే భాస్కర్, సుబ్బయ్య, బాలకృష్ణ, పూజారి నాగభూషణం, అంజి, మనోహర్ నాయుడు, చల్లా సోము, టిసి సుబ్రహ్మణ్యం, పసల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

చిలమత్తూరు : మండలంలో బంద్ పాక్షికంగా కొనసాగింది. ప్రయివేటు పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్ చేయగా ప్రభుత్వ పాఠశాలు యథావిధిగా కొనసాగాయి. కొందరు టిడిపి, జనసేన నాయకులను హౌస్ అరెస్టు చేశారు. మరికొందరిని స్టేషన్‌కు తరలించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి అంజనప్ప మధ్యాహ్నం 3 గంటల సమయంలో రోడ్డుపైకి వచ్చి షాపులు బంద్ చేయాలని రోడ్డుపై వాహనాలకు అడ్డుగా పడుకొని నిరసన తెలిపారు. దీంతో పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

గాండ్లపెంట : టిడిపి ఆధ్వర్యంలో ప్రశాంతంగా బంద్‌ను పర్యవేక్షిస్తుండగా పోలీసులు నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేశారు. కదిరి ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ గాండ్లపెంటకు చేరుకోగా పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కందికుంట మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం కక్ష సాధింపు తో కేసులు బనాయిస్తుందని, రాబోయే ఎన్నికల్లో వైసిపిని చిత్తుచిత్తుగా ఓడిస్తామన్నారు. కార్యక్రమంలో గంగరాజు, మండల కన్వీనర్ కొండయ్య, ప్రసాద్, కార్యకర్తలు, పాల్గొన్నారు.

తనకల్లు : చంద్రబాబు ఆరోగ్యంగా ఉండాలని, తక్షణం బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ మండల పరిధిలోని తవలం ఆంజనేయస్వామి దేవాలయంలో యువ నాయకులు తోట కిషోర్, నాగార్జున ఆధ్వర్యంలో 101 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గేమే నాయక్ తండా సర్పంచి మూడే కాంతమ్మ, మండల కోకన్వీనర్ బ్రహ్మానందరెడ్డి, పిజి మల్లికార్జున, హరినాయక్, రమణయ్య, మండల ప్రధాన కార్యదర్శి నాగేంద్రప్రసాద్, ఉత్తన్న నాయక్, తీరుపల్లి దామోదర్, కుల్లాయప్ప, శంకర్ నాయక్, శివయ్య, వాల్మీకి అశోక్, పులికంటి నరసింహులు, ఓబులేసు, వెంకటేష్, బాబు, శ్రీనివాసులు, వెంకటరమణ, వీరానపల్లి రమణ, పెద్దపల్లి భాస్కర్‌రెడ్డి, శివరాం, తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : మండల పరిధిలోని పాముదుర్తి, మారాల, కృష్ణాపురం, తదితర గ్రామాల్లో టిడిపి నాయకులు బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలను మూసి వేయించారు. బుక్కపట్నంలో టిడిపి నాయకులను పోలీసులు గృహ నిర్బంధంతో పాటు స్టేషన్‌కి తరలించగా అక్కడే సిఎం జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కొందరిని ఎక్కడికక్కడ నిర్బంధించారు. దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేసి బంద్ నిర్వహించారు. పాముదుర్తిలో జన సేన, టిడిపి ఆధ్వర్యంలో బంద్ నిర్వహించి పాఠశాలలు, బ్యాంకులను మూసి వేయించారు. కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ జంగం వెంకటరాముడు, యశోదరాయుడు, లావణ్య గౌడ్, సయ్యద్‌బాషా, లింగప్పగారిపల్లి రవి, అంబులెన్స్ రమేష్, సుధీర్, శ్రీనివాసులు, మంజు, శ్రీనివాస్‌రెడ్డి, సతీష్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

'పురం'లో బంద్ పాక్షికం

హిందూపురం : టిడిపి తలపెట్టిన బంద్ పట్టణంలో పాక్షికంగా జరిగింది. ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి.



'పురం'లో టిడిపి కార్యకర్తను అరెస్టు చేస్తున్న పోలీసులు

నాయకులు, కార్యకర్తలు తెల్లవారుజాము నుంచే రోడ్డుపైకి రావడంతో వ్యాపార సముదాయాలు మూతపడ్డాయి, విద్యాసంస్థలు తెరుచుకోలేదు. కొన్ని ప్రాంతాల్లో రోడ్డుపై టైర్లు అంటించి ఆందోళన చేపట్టారు. బెంగళూరు రహదారిపై కిరికెర మాజీ సర్పంచి రాము ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించారు. పోలీసులు ఆందోళనకారులను స్టేషన్ కు తరలించారు. పూలకుంట వద్ద రహదారిపై కంపలు వేసి, టైర్లకు నిప్పు పెట్టారు. వాల్మీకి సర్కిల్‌లో హిదయతుల్లా ఆధ్వర్యంలో రోడ్డుపై బైఠాయించగా స్టేషన్‌కు తరలించారు. కొందరు ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకుల వద్దకు వెళ్లి బంద్‌కు సహకరించాలని కోరగా కొద్ది సేపు మూసి వేశారు. ఎమ్మెల్యే బాలకృష్ణ నివాసం నుంచి నాయకులు శ్రీనివాస్‌రావు, రమేష్ కుమార్, అంజినప్ప తదితరులు పట్టణంలోకి వస్తుంటే వారిని చౌడేశ్వరీ కాలనీ వద్ద డిఎస్‌పి కంజాక్షన్, వన్‌టౌన్, అప్‌గ్రేడ్ సిఐలు శ్రీనివాసులు, ఎస్ఐ హారూన్‌బాషా, సిబ్బంది అడ్డుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకులు ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. జనసేన నాయకులను ముందోస్తుగానే అరెస్టు చేసి వన్‌టౌన్ స్టేషన్‌కు తరలించారు. అరెస్టు చేసిన వారిని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. చంద్రబాబు అరెస్టును సిపిఐ, బిఎస్‌పి నాయకులు ఖండించారు. బిఎస్‌పి కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో శ్రీరాములు మాట్లాడుతూ చంద్రబాబు అరెస్టు కక్ష సాధింపు చర్యకు నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఇస్మాయిల్, చంద్రశేఖర్‌రెడ్డి, మారుతిరెడ్డి, పాల్గొన్నారు.

ప్రజలే బుద్ధి చెబుతారు : చిలకం

ధర్మవరం టౌన్ : ప్రజాస్వామ్యపద్ధతిలో శాంతియుతంగా నిరసన తెలిపితే అరెస్టులు చేయడం ఎంతవరకు సమంజసమని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి మండిపడ్డారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న పరిటాల శ్రీరామ్, జనసేన నాయకులను అరెస్టు చేసిన విషయం తెలుసుకున్న ఆయన వన్‌టౌన్ స్టేషన్‌కు చేరుకుని పరామర్శించారు. పరిటాల శ్రీరామ్‌కు సంఘీభావం తెలిపారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని త్వరలోనే ప్రభుత్వానికి బుద్ధి చెబుతారన్నారు. రాష్ట్రంలో సిఎం జగన్ ఆధ్వర్యంలో రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తోందని, అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని వైసిపి ప్రభుత్వం అపహాస్యం చేస్తున్నారని విమర్శించారు.

మడకశిర : మడకశిర, రొళ్ల, అగళి, అమరాపురం, గుడిబండ, మడకశిర పట్టణం, గ్రామస్థాయిలో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆందోళనలకు దిగారు. నియోజకవర్గ వ్యాప్తంగా దుకాణాలను మూసివేసి బంద్ నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, తెలుగు తమ్ముళ్లు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్ట్‌కు సూత్రధారి సిఎం జగన్
టిడిపి జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి

పెనుకొండ : చంద్రబాబు అరెస్టుకు ప్రధాన సూత్రధారి, పాత్రధారి సిఎం జగనే అని టిడిపి జిల్లా అధ్యక్షులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి బికె పార్థసారథి పేర్కొన్నారు. బంద్ నేపథ్యంలో పట్టణంలోని స్థానిక వై జంక్షన్ వద్ద సోమవారం పార్థసారథి ఆధ్వర్యంలో 44వ జాతీయ రహదారిని దిగ్బంధించి టైర్లు కాల్చారు. ప్రభుత్వానికి వ్యతి రేకంగా ఆందోళన చేపట్టారు. ట్రాఫిక్ స్తంభించడంతో సిఐ కరుణాకర్, ఎస్ఐ రమేష్ బాబు పోలీసులు పార్థసా రథి, నాయకులు చిన్న వెంకటరాముడు, కేశవయ్య, రఘువీరాచౌదరి, రామలింగ, బోయ నాగరాజు, పోతిరెడ్డి, బోయ గాయిత్రి, అనిల్, గోపి, ప్రసాద్, నాని, తదితరులను బలవంతంగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. కురుబ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో దర్గా సర్కిల్ నుంచి ఎస్‌కెడి సర్కిల్‌లో ఉన్న దుకాణాలను బంద్ చేయించారు. దీంతో పోలీసులు అతడితో పాటు నాయకులు ఆంజనేయులు, అక్కులప్ప, కార్యకర్తలను స్టేషన్‌కు తరలించారు.

సవితమ్మ అరెస్ట్..

టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ ఆధ్వర్యంలో తెలుగు తల్లి సర్కిల్ నుంచి గాంధీ సర్కిల్ మీదుగా దర్గా రోడ్డు వరకూ ఉన్న దుకాణాలను బంద్ చేయించారు. రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తుండగా పోలీసులు సవితమ్మతో పాటు నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

గుడిబండ : గుడిబండతో సహా మండలంలోని వివిధ గ్రామాల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, వాణిజ్య సంస్థలు, దుకాణాలను మూయించి శాంతియుతంగా ధర్నా చేపట్టారు. పోలీసులు ధర్నాని భగ్నం చేసి స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం 5 గంటల తర్వాత విడుదల చేశారు. అరెస్టయిన వారిలో మండల కన్వీనర్ మదనకుంటప్ప, న్యాయవాది శివకుమార్, దుర్గేష్, మంజునాథ్ ఉన్నారు.

అమరాపురం : మండల పరిధిలోని తమ్మడపల్లి, బసవన్నపల్లి, హేమావతి, వలస ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాలు, వ్యాపార దుకాణాలను మూయించారు. మండల కన్వీనర్ గణేష్, కృష్ణమూర్తి, శివరుద్రప్ప, నరసింహమూర్తి, హనుమంతరాయ, జయకుమార్, ఇతర నాయకులను ఎస్ఐ వెంకటేశులు ఉదయం 7 గంట లకే స్టేషన్‌కు తరలించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో చంద్రబాబును విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచి లోకేష్, మద్దనకుంట రఘు, రాజప్ప, శివకుమార్ పాల్గొన్నారు.

టిడిపి, జనసేన పార్టీల ఆధ్వర్యంలో బంద్

లేపాక్షి : మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలు, కార్యాలయాలు, బ్యాంకులను బంద్ చేయించారు. కార్యక్రమంలో కన్వీనర్ జయప్ప, ఆనంద్‌కుమార్, రామాంజనమ్మ, రవి, చంద్ర, శ్రీరామ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : జిల్లాలో బంద్ కారణంగా అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. పుట్టపర్తి, కొత్తచెరువు, ధర్మవరం టౌన్ పోలీసు అధికారులకు భద్రతా ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. ఆయా ప్రాంతాల్లో ఉదయం ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి పర్యటించి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ప్రధాన రహదారులు, ముఖ్య కూడళ్లు, బస్టాండ్లు, ప్రధాన ప్రభుత్వ కార్యాలయాల వద్ద పోలీస్ పికెట్, పెట్రోలింగ్‌తో పాటు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెద్దఎత్తున పోలీసు బలగాలను మోహరించారు. జిల్లాలో 30 యాక్ట్ అమలులో ఉందని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు.

ముదిగుబ్బ : బంద్ పర్యవేక్షణలో భాగంగా ఎస్పీ మాధవ్‌రెడ్డి ధర్మవరం నుంచి కదిరి వెళ్తూ మార్గమధ్యలో ముదిగుబ్బలో బందోబస్తులో ఉన్న సిఐ యతీంద్ర, టౌన్ సిఐ హేమంత్‌కుమార్‌లను కలిసి బంద్‌పై ఆరా తీశారు. అలాగే సూచనలు సలహాలు ఇచ్చారు. ముదిగుబ్బలోని నాలుగు రోడ్ల కూడలిలో జాతీయ రహదారిపై టిడిపి, సిపిఐ, జనసేన, నాయకులు బైఠాయించగా పోలీసులు ధర్నాను భగ్నం చేశారు. కార్యక్రమంలో నాయకులు రమేష్‌బాబు, ప్రభాకర్‌నాయుడు, తుమ్మల మనోహర్, సూరి, కృష్ణమూర్తి యాదవ్, సిపిఐ మండల కార్యదర్శి శ్రీనివాసులు, జనసేన నాయకులు జయప్ప పాల్గొన్నారు,

పరిగి : పరిగిలో బంద్ ఉద్రిక్తతకు దారి తీసింది. ఉదయం నుంచే షాపులను బంద్ చేసేందుకు ప్రయత్నించిన టిడిపి నాయకులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో రోడ్డుపై బైఠాయించి వాహనాలను నిలుపుదల చేసి గార్మెంట్స్ ఫ్యాక్టరీలను మూసివేయాలని డిమాండ్ చేశారు. కొందరు ఆర్టీసీ బస్సు అద్దాలు పగల గొట్టడంతో ఎస్ఐ నరేంద్ర లాఠీఛార్జ్ చేసి పలువురుని స్టేషన్‌కు తీసుకెళ్లారు. 13 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నాయకులు లక్ష్మారెడ్డి, చంద్రశేఖర్, ఈశ్వరప్ప పాల్గొన్నారు.

కదిరి టౌన్ : నియోజకవర్గ ఇన్‌ఛార్జి కందికుంట వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు ఉదయం 6 గంటలకే స్థానిక అంబేద్కర్ సర్కిల్, ఆర్టీసీ బస్టాండ్ వద్దకు చేరుకొని రాకపోకలను అడ్డుకున్నారు. ఆర్టీసీ సిబ్బంది స్వచ్ఛందంగా బంద్‌కు సహకరించాలని ప్రయాణికులు, ఆర్టీసీ డిఎంకు విజ్ఞప్తి చేశారు. దీంతో పోలీసులు కందికుంటను బలవంతంగా గాండ్లపెంట స్టేషన్‌కు తరలించారు.

జనసేన, సిపిఐ నాయకులు అరెస్ట్

బంద్‌లో పాల్గొన్న జనసేనా ఇన్‌ఛార్జి భైరవప్రసాద్, కుటాల లక్ష్మణ, సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య, కదిరి డివిజన్ కార్యదర్శి ఇషాక్, పట్టణ కార్యదర్శి లియాకత్, ముబారక్, ఇమ్రాన్ రైతు సంఘం నాయకులు మధు, ఎఐఎస్ఎఫ్ నాయకులు నల్లజోడు పవన్, దుద్దుకుంట కిరణ్, గణేష్, తదితర నాయకులు అరెస్ట్ చేసి పట్టణ స్టేషన్‌కు తరలించారు.

పుట్టపర్తి రూరల్ : మండల పరిధిలోని పెడపల్లి, వెంగళమ్మచెరువు, మామిళ్లకుంట, యనమలపల్లి గ్రామాల్లో టిడిపి నాయకులు కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. వెంగళమ్మచెరువులో ఉన్నత పాఠశాల, సొసైటీ, అనంత గ్రామీణ బ్యాంకు, దుకాణాలను మూయించారు. ౦౦ పుట్టపర్తి– కదిరి ఆర్టీసీ బస్సులను అడ్డుకోగా రూరల్ ఎస్ఐ దాదాపీర్ ఆధ్వర్యంలో కొంతమందిని అర్బన్ స్టేషన్‌కు కొంతమందిని రూరల్ స్టేషన్‌కు తరలించారు. పెడపల్లిలో శ్రీరామ్‌నాయక్ ఆధ్వర్యంలో గోరంట్ల–ధర్మవరం ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించగా రూరల్ ఎస్ఐ అదుపులోకి తీసుకున్నారు. గ్రామంలో దుకాణాలను మూసేశారు.

తలుపుల : తలుపులలో టిడిపి నాయకులు ఆందోళన నిర్వహించి రోడ్డుపై బైఠాయించారు. ప్రభుత్వ, ప్రయివేటు దుకాణాలను మూయించారు. పోలీసులు ఆందోళనకారులను స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ముబారక్, రాజారెడ్డి, ఎద్దుల రాముడు, బాబురెడ్డి, జయచంద్ర, నారాయణరెడ్డి, గంగరాజు, రఘునాథరెడ్డి, ఉప్పర రామ్మోహన్ రెడ్డి, గంగార్జున, రాధాకృష్ణ, నరసింహులు, సిపిఐ నాయకులు ఈశ్వరయ్య, సిద్దయ్య, బ్రహ్మయ్య, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు : టిడిపి నాయకులు ప్రయివేటు దుకాణదారులను మూయించారు. ఎస్ఐ కె. గోపి, పోలీసులు టిడిపి శ్రేణులను అరెస్టు చేశారు. దీంతో వారు కళ్లకు నల్లగంతలు కట్టుకుని స్టేషన్ ముందు బైఠాయిం చి నిరసన తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జయచంద్ర, పిట్ట ఓబుల్‌రెడ్డి, బూదిలి ఓబుల్‌రెడ్డి, షేక్ నిజాం, ఆర్ఎంపి జాకీర్, బడిశం రామాంజనేయులు, అంజనప్ప, మండల ప్రధాన కార్యదర్శి పీట్ల సుధాకర్, మండోజి ఆరిఫ్‌ఖాన్, పొగాకు షబ్బీర్, గండికోట ఇర్షాద్, మండ్యం చాంద్‌బాషా, కంచి సురేష్, పొగాకు షానవాజ్, గంగాద్రి, కొండే ఈశ్వరయ్య, గంగాధర్, జయచంద్రారెడ్డి, డ్రిప్పు నాగరాజు, శ్రీనివాసులు, నారపరెడ్డి, అంజన్‌రెడ్డి, సాంబశివరెడ్డి, రాయల్ కుమార్, గొర్ల శంకర, సర్పంచి శంకర్‌రెడ్డి, ఎంపిటిసి శ్రీనివాసులు, నాగేంద్ర పాల్గొన్నారు.

బుక్కపట్నం : రాష్ట్రంలో నియంత పాలన సాగుతోందని చంద్రబాబు అరెస్టు ఇందుకు నిదర్శనమని టిడిపి నాయకులు పెద్దరాసు సుబ్రహ్మణ్యం తెలిపారు. సైకో ప్రభుత్వంలో శాంతియుతంగా నిరసనలు తెలపడానికి కూడా లేదన్నారు. అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో నియంత జగన్‌కు ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

బత్తలపల్లి : గోనుగుంట్ల విజయకుమార్ ఆధ్వర్యంలో బంద్‌ను పర్యవేక్షించారు. దీంతో మండల కన్వీనర్ నారాయణరెడ్డి, సురేందర్‌నాయుడు, నెట్టెం రమణ, బోయపాటి అప్పసామి, చాల్లా శ్రీనివాసులు, తల్లూరు సతీష్‌నాయుడు, తదితరులు పోలీసులు అరెస్టు చేసి సొంతపూచీకత్తుపై విడుదల చేశారు.

తనకల్లు : మండల పరిధిలోని కొక్కంటి క్రాస్‌లో మండల తెలుగు యువత అధ్యక్షుడు కావడి ప్రవీణ్ కుమార్ నేతత్వంలో సిఎం జగన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తాజుఖాన్, శివ, ఫయాజ్, నరేష్, దాము, జల్లా రవిరెడ్డి, ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : టిడిపి బంద్‌లో భాగంగా ఆందోళన చేపట్టిన నిరసన కారులపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. పట్టణంలో టిడిపి నాయకులు దుకాణాలు, హోటళ్లు మూసివేయాలని ర్యాలీ నిర్వహించగా సిఐ బాలసుబ్రమణ్యంరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఆందోళనకారులను ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. రాత్రి నుంచే పట్టణంలో యాక్ట్–30ని అమలు చేస్తున్నారు. సభలు, ర్యాలీలు, నిరసనలు చేయరాదని హెచ్చరించారు. ఆర్టీసీ బస్సులను అధికారులు నిలిపివేశారు. పట్టణంలోకి వస్తున్న వాహనాలను పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేపట్టారు. నిరసన ర్యాలీలలో అరెస్టు అయిన వారిలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ బెస్త చలపతి, కోనంకి గంగాధర్ నాయుడు, ఆవులు సుబ్రహ్మణ్యం, సుభాష్ చంద్ర, సుబ్బ రాయుడు, నాయకులు జయప్రకాష్, ఉన్నారు. పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, తదితరులు గృహ నిర్బంధంలో ఉన్నారు.

అగళి : టైర్లు కాల్చి నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి నాయకులు. ధర్మవరం : మహిళా కార్యకర్తలను అరెస్టు చేస్తున్న పోలీసులు. పెనుకొండ : సవితమ్మ ఆధ్వర్యంలో ర్యాలీ. ముదిగుబ్బ : మద్దతు తెలిపిన సిపిఐ నాయకులు. తనకల్లు : సిఎం జగన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టిడిపి నాయకులు

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, PENUKONDA.
I.P.No.1/2023

Between:
P.Rizwana Begum ...PETITIONER/Debtor
AND
Pyarima and 19 others, ...RESPONDENT/Creditors

1 నుండి 3 ప్రతివాదులు–క్రెడిటార్స్ కు నోటీసు

1. ప్యారిమా భర్త మహబూబ్ సాబ్ (డ్రైవర్), వయస్సు 55 సం॥లు, వడ్డి వ్యాపారం, డోర్ నెంబర్ 6–24, గాంధీ నగర్, మౌనిక థియేటర్ వెనుకాల, కదిరి, శ్రీ సత్యసాయి జిల్లా.
2. రమాదేవి భర్త శ్రీనివాసులు, వయస్సు 38 సం॥లు, వడ్డి వ్యాపారం, డోర్ నెంబరు 6–26,గాంధీ నగర్, మౌనిక థియేటర్ వెనుకాల, కదిరి, శ్రీ సత్యసాయి జిల్లా.
3. అయిషా భర్త పీర భక్తర్ (టైలర్), వయస్సు 36 సం॥లు, డోర్ నెంబరు 4–701, రాధ క్రిష్ణ ఇంటి దగ్గర, బాలాజీ సర్కిల్, మెయిన్ రోడ్డు, గోరంట్ల–515231, శ్రీ సత్యసాయి జిల్లా.

ఇందుమూలముగా 1 నుండి 3 ప్రతివాదులు–క్రెడిటార్స్ కు తెలియజేయడం ఏమనగా, పై కోర్టులో పై కేసులో 15/09/2023వ తేదిన మీకు వాయిదా ఉన్నది. కావున మీరు పై కోర్టులో, పై కేసులో 15/09/2023వ తేదిన ఉదయం 10:30 గంటలకు ఖుద్దున లేక, మీ వకీలు ద్వారా కాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవచ్చును. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
బి.అబుబకర్, బి.ఎస్సీ, బి.ఎల్.,
బి.ఎమ్.డి.షానవాజ్, బి.ఎ.,ఎల్.ఎల్.బి,
అడ్వకేట్స్, పెనుకొండ, శ్రీ సత్యసాయి జిల్లా.
సెల్ నెం:9989453939

నేరాలు ఘోరాలు

లారీ, బైక్ ఢీ.. వ్యక్తి మృతి

అగళి : మండల పరిధిలోని వడగుంటనపల్లి గ్రామ సమీపంలో కర్నాటకలోని శిర నుంచి హిందూపురం వెళ్తున్న లారీని ద్విచక్ర వాహనంపై శిర నుంచి నందరాజులపల్లికి వస్తున్న కావులప్ప(55) అతివేగంగా వచ్చి మలుపులో అదుపుతప్పి లారీని వెనకవైపు ఢీకొన్నాడు. దీంతో తలకు బలమైన గాయాలు కావడంతో స్థానికులు శిర ఆసుపత్రికి తరలిస్తూ ఉండగా మార్గమధ్యలో మృతి చెందాడని అతడి బంధువులు తెలిపారు. అతడికి భార్య లక్ష్మీదేవి, ఇద్దరు కుమార్తెలు, ఒక కొడుకు ఉన్నారు. ఎస్ఐ లావణ్య సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ...

గోరంట్ల రూరల్ : మండల పరిధిలోని గౌనువారిపల్లి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శాంతమ్మ(55) మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గౌనువారిపల్లి గ్రామానికి చెందిన శాంతమ్మ కుమారుడు శ్రీనాథ్ ద్విచక్ర వాహనంపై గోరంట్లకు పని నిమిత్తం వెళ్తుండగా గౌనివారిపల్లి సమీపంలో కదిరి నుంచి గోరంట్ల వైపు వస్తున్న పాల ట్యాంకర్ ఢీకొనడంతో శాంతమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. శ్రీనాథ్‌కి గాయాలు కాగా గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అలాగే మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెనుకొండకు హాస్పిటల్‌కి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

పుట్టపర్తి క్రైమ్ : పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని ప్రశాంతి గ్రామ్ సమీపంలోని విద్యుత్ కేంద్రం వెనుక వైపు సోమవారం ఓ చెట్టుకు ఉరి వేసుకుని సురేంద్రనాయక్ (33) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. సురేంద్రనాయక్ అమడగూరు మండల పరిధిలోని కొట్టువారిపల్లి గ్రామం నుంచి పదేళ్ల క్రితం పుట్టపర్తికి వలస వచ్చాడు. ఇక్కడ స్థానికంగా బంధువులు ఉండటంతో ఇక్కడే స్థిరపడిపోయి ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ దాదాపీర్, సిబ్బంది అక్కడికి వెళ్లి కేసు దర్యాప్తు చేపట్టారు.

వైసిపి కార్యకర్తపై దాడి.. కేసు నమోదు

బత్తలపల్లి : మండల పరిధిలోని నెత్తివారంపల్లి గ్రామంలో వైసిపి కార్యకర్తపై టిడిపి కార్యకర్తలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. హెడ్ కానిస్టేబుల్ రామాంజనేయులు తెలిపిన వివరాల మేరకు.. నరేంద్రప్రసాద్ బెంగళూరులో మెకానిక్‌గా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టుపై సోషల్ మీడియాలో నరేంద్ర ప్రసాద్ పోస్టులు చేశారని వాటిని తొలగించాలని కుటుంబ సభ్యులను టిడిపి కార్యకర్తలు ఆనంద్, నాగభూషణ, బాలనరసింహులు, మరో వ్యక్తి బెదిరించినట్లు తెలిపారు. ఆదివారం సెలవు కావడంతో గ్రామానికి చేరుకున్న నరేంద్రప్రసాద్‌పై వారు దాడి చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా వాలంటీరుగా విధులు నిర్వహిస్తున్న నరేంద్రప్రసాద్ వదిన కుమారిని బెదిరించినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యం

బత్తలపల్లి : మండల పరిధిలోని అనంతసాగరం గ్రామానికి చెందిన వివాహిత మహిళ అదృశ్యమైనట్లు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. గ్రామానికి చెందిన ఈశ్వరయ్య కరెంట్ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ నెల 6వ తేదీన ఇంట్లో నుంచి పని నిమిత్తం ఈశ్వరయ్య వెళ్లాడు. ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో అతడి భార్య కృపావతి(19) ఇంటి నుంచి వెళ్లిపోయింది. సాయంత్రం ఇంటికి చేరుకున్న ఈశ్వరయ్యకు భార్య కనిపించలేదు. దీంతో బంధువులు, ఇతరులు ఇళ్లలో విచారించాడు. సమాచారం లేకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబల్ నాగరాజు తెలిపారు.

కస్తూరి రంగనాథస్వామి ఆలయానికి విరాళాలు

గోరంట్ల రూరల్ : మండల పరిధిలోని వానవోలు గ్రామ సమీపంలో వెలసిన అతి పురాతన కస్తూరి రంగనాథస్వామి ఆలయ అభివృద్ధికి భక్తులు విరాళాలు విరివిగా ఇస్తున్నారు. కదిరి పట్టణానికి చెందిన సబిత, నాగరాజు దంపతు లు రూ. 1,50,001, పెనుకొండ పట్టణానికి చెందిన గాజుల రంగప్ప, రామాంజమ్మ రూ. 50,116 విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు సమర్పించారు. ఆలయ పునర్నిర్మాణానికి దాతలు మరింతమంది ముందుకు రావాలని ఆలయ అర్చకులు శ్రీధర్‌స్వామి, కమిటీ సభ్యులు కోరారు.

బదిలీ ఎస్ఐకు వీడ్కోలు

రొద్దం : రొద్దం మండల ఎస్ఐగా నాగస్వామి దాదాపు ఒకటిన్నర సంవత్సరంగా పని చేసి బదిలీపై తాడిమర్రికి వెళ్తుండడంతో సోమవారం పలువురు నాయకులు, సిబ్బంది, పాత్రికేయులు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నాగస్వామి పోలీస్ అధికారిగా కాకుండా స్నేహితుడిగా మెలిగారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, పెనుకొండ నియోజకవర్గ అధ్యక్షులు చిన్నప్పయ్య, హరీష్, పోలీసులు, పాత్రికేయులు, తదితరులు పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-కదిరి టౌన్

రూరల్ మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో డాక్టర్ హరిప్రసాద్ నివాసంలో ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఘనం గా నిర్వహించారు. హరిప్రసాద్, డాక్టర్ బత్తల వెంకటరమణ ఆధ్వర్యంలో రూరల్‌లోని ఆర్డిటి వికలాంగుల పాఠశాలలో విద్యార్థులతో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు బహావుద్దీన్, మాజీ సర్పంచి బత్తల వెంకటరమణ, వైస్ ఎంపిపి బత్తల ఆదినారాయణ, బాబా, న్యామత్, జాకీర్, జిలాన్, ఆర్ఎంఎస్ గౌస్, బాబ్‌జాన్, కిరణ్, మస్తాన్, సూరినేని కిరణ్, కటిక షఫీ, రహంతుల్లా, బాబు, నూర్, ఫరూఖ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుప్పట్లు

ప్రజాశక్తి-చిలమత్తూరు

రాజంపేట వైసిపి ఎంపి మిథున్‌రెడ్డి జన్మదినం సందర్భంగా వైసిపి యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కోటమీద సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో వికలాంగ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కోడూరు పంచాయతీ పరిధి లోని– సమర్థనం ట్రస్ట్‌లో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నియోజక సమన్వయకర్త భర్త వేణురెడ్డి, ఎంపిపి పురుషోత్తమరెడ్డి పాల్గొన్నారు. కేక్ కట్ చేసి చిన్నారులకు పంచి పెట్టారు. అనంత రం దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు రామక్రిష్ణారెడ్డి, హనుమంతరెడ్డి, బాబేనాయక్, షాకీర్, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

In the court of the Junior Civil Judge Puttaparthy
I.A.No:22/2023 in O.S.No:8/2023

Between:
N.Sreenivasulu ...Petitioner/ Plaintiff
And
A.Anjani Lakshmi Kala and Others ...Respondents/Defendants

Notice and Summon to the Respondents /Defendants nos 2 and 3

To
D2: A.K.Bharadwaj S/o Late A.K.ViJaya Suresh ,aged about 22 years , Hindu, Student ,Resident of Judicial Lay out, Ninkam palli Road, Hindupur
D3: A.K.Sreeja D/o Late A.K.ViJaya Suresh, aged about 19 years , Hindu, Student ,Resident of Judicial Lay out , Ninkam paill Road , Hindupur

Where as the petitioner has filed the above I.A 22/2023 for attachment of the petition schedule property and suit in O.S 8/2023 for recovery of the suit amount against you and you are here by summoned and notice to appear before this Hon'bie court in person or by a pleader on 13-9-2023 at 10-30 AM to answer the same. Falling which the matter will be disposed off exparte.

Hearing Date:13-9-2023

(By order of the court)

Address for service of Petitioner /Plaintiff
Sri .M.Rajendra Prasad Reddy
Advocate Puttaparthy